క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వివిధ మరమ్మతుల కారణంగా బుధవారం నగరంలో పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ మంగళవారం ప్రకటించారు. ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకూ కలిగే అంతరాయంతో కాతేరు గ్రామంలోని సుబ్బారావు పేట, శాంతినగర్, భరత్‌నగర్, వేణుగోపాలపురం, దాసరి నగర్, జీఎస్ఆర్ ఆన్‌లైన్ ఏరియా, పంచాయతీ ప్రాంతం, సీతానగరం రోడ్డు, రామదాసు పేట, ఇందిరానగర్, గాదిరెడ్డి నగర్, వెంకటపురం, సీసీ కాలనీ, పేపర్‌మిల్లు క్వార్టర్స్ ప్రాంతాల్లో ప్రభావం ఉంటుందన్నారు.

మహా కుంభమేళాకు రెండు బస్సులు



మహా కుంభమేళాకు బయలు దేరిన బస్సుల వద్ద ప్రయాణికులు

రాజమహేంద్రవరం సిటీ: మహా కుంభమేళాకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి రెండు సూపర్ లగ్జరీ బస్సులు మంగళవారం బయలుదేరి వెళ్లాయని డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఈ యాత్రలో భక్తులకు భువనేశ్వర్, పూరి, కోణార్క్, గయా, బుద్ధగయా, వారణాసి, అయోధ్య, నైమిశారణ్యం, జాజ్పూర్, సీతామడి, అరసవిల్లి క్షేత్రాల్లో దర్శనం ఉంటుందన్నారు. ఒక్కో బస్సులో 36 మంది భక్తులు బయలుదేరి వెళ్లారని, తిరిగి మార్చి 2న రాజమహేంద్రవరం చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో డిపో ట్రాఫిక్, గ్యారేజ్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సత్యప్రసాద్ తదితరులు

కడియం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో వెలుగుబంటి రామచంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అనపర్తికి చెందిన రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యురాలు రమాదేవి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ట్రస్టు అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళల వ్యాధులకు సంబంధించి పలు రకాల వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి తమ ఆసుపత్రిలో స్కానింగ్‌ను ఉచితంగానే చేస్తామని డాక్టర్ రమాదేవి తెలిపారు. పేదలకు అతి తక్కువ ఖర్చుతోనే వైద్య సదుపాయం కల్పిస్తున్న రమాదేవిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రక్షణా.. అదెక్కడ!



కోరుకొండ బస్టాండ్ సెంటర్ వద్ద ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతం

మధురపూడి: కోరుకొండ బస్టాండ్ పక్కన మలుపు వద్ద వంతెన ప్రాంతం ప్రమాదకరంగా మారింది. ఇక్కడ రక్షణ గోడ లేక ప్రయాణం దినదిన గండమైంది. ఇక్కడ రాత్రి వేళల్లో పొరపాటున కాలుజారితే కాలువలోకి వెళ్లాల్సిందే. రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం వెళ్లే రహదారిని ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పటికే పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్య మినీ	: కెప్టెన్ అమెరికా
సూర్య ప్యాలెస్	: చావా
స్వామి	: బ్రహ్మ ఆనందం
శివజ్యోతి	: తండేల్
అనుశ్రీ	: లైలా
రాజా	: సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి	: కాంప్లికేటెడ్
మేనక	: నిదిరించు జహాపన, తల
రంభ	: ఆరెంజ్
కుమారి	: కెప్టెన్ అమెరికా
అప్సర	: తండేల్
అశోక	: లైలా
నామవరం	
వీఎస్ మహల్	: తండేల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: తండేల్
కడియం	
వెంకటసూర్య	: లైలా

దిగజారుడు రాజకీయాలొద్దు

- మాజీ మంత్రి రాజాపై దాడి దారుణం
- వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లాల యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ గణేష్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్

రాజమహేంద్రవరం సిటీ: కాకినాడ జిల్లా తునిలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజాపై టీడీపీ శ్రేణులు దాడి చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాజాపై దాడికి నిరసనగా చలో తుని కార్యక్రమానికి పిలుపునివ్వడంతో జక్కంపూడి గణేష్‌ను పోలీసులు తుని వెళ్లకుండా అడ్డుకున్నారు. స్థానిక జేఎన్ రోడ్డులో ఉన్న ఆయన కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గణేష్ మీడియాతో మాట్లాడుతూ తుని మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని దక్కించుకోవాలనే ఉద్దేశంతో టీడీపీ అక్రమాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఎన్ని రకాలుగా వైఎస్సార్ సీపీ శ్రేణుల్ని భయపెట్టాలని చూసినా భయపడే ప్రసక్తే లేదన్నారు. టీడీపీకి మెజార్టీ లేకపోయినా వైస్ చైర్మన్ పదవిని దక్కించుకోవాలని దురాలోచన చేయడం సరికాదన్నారు. కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసి ఇబ్బంది పెట్టి లాక్కోవాలని ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు రక్షణ కల్పించకుండా అధికార యంత్రాంగం, పోలీసులు వ్యవహరించడంపై మండిపడ్డారు. తిరిగి తప్పుడు మార్గంలో దాడిశెట్టి రాజాపైనే కేసులు నమోదు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దాడిశెట్టి రాజా తునికి మాత్రమే పరిమితం కాదని, ఉభయ గోదావరి జిల్లాల్లో ఆయన అనుచరులు, అభిమానులు చాలామంది ఉన్నారన్నారు. జరుగుతున్న పరిణామాలను ప్రజలంతా గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తేవడానికి కృషి చేస్తామన్నారు. తమను పార్టీ నుంచి దూరం చేయాలనే ఆలోచన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని, దీనికి ప్రజలే సరైన సమయంలో సమాధానం చెబుతారన్నారు. పోలీసులు కూడా టీడీపీ కార్యకర్తల్లా విధులు నిర్వహించడంపై ఆలోచన చేసుకోవాలన్నారు. తమకు ఒకరోజు వస్తుందని అప్పుడు గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఆయన వెంట పార్టీ నాయకులు అరుణ్ జేకే, రాయుడు రాకేష్, అడపా అనిల్, కోడి కోట, తగరం సోము, నల్లం రాజేష్, గొట్టిముక్కల రాజు, బాలాజీ రెడ్డి, కురుమెల్లి స్వరూప్ తదితరులు ఉన్నారు.



నిరసన తెలియజేస్తున్న జక్కంపూడి గణేష్

సాయుధ బలగాల కవాతు



సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): యాన్యువల్ డీమొబలైజేషన్‌లో భాగంగా స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సాయుధ బలగాల కవాతు మంగళవారం నిర్వహించారు. దీనికి ఎస్పీ డి.నరసింహాకిశోర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సాయుధ బలగాల యాన్యువల్ డీమొబలైజేషన్ కవాతు వీక్షించి, గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సాయుధ బలగాలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటూ అత్యవసర పరిస్థితుల్లో సమర్థంగా వ్యవహరించేందుకు ఈ రీఫ్రెష్ ట్రైనింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ మొబలైజేషన్ శిక్షణ పోలీసు సిబ్బందికి వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఎల్.అర్జున్, ఎల్.చెంచిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, రవికుమార్, ఏ.శ్రీనివాసరావు, పవన్ కుమార్‌రెడ్డి, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు దాతల ప్రోత్సాహం ఎనలేనిది



జోస్ అలుక్కాస్ డీజీఎం కార్తీక్‌ను సత్కరిస్తున్న జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి వాసుదేవరావు

రాజమహేంద్రవరం రూరల్: పాఠశాలలకు దాతలు అందిస్తున్న ప్రోత్సాహం ఎనలేనిదని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బంగారు వ్యాపార సంస్థ జోస్ అలుక్కాస్ సీఎస్ఆర్ నిధులు రూ.నాలుగు లక్షలతో ఫర్నీచర్, అహుజా వైర్లెస్ మెక్‌సెట్, నాలుగు గోద్రేజ్ ఐరన్ బీరువాలు, పోడియం, కలర్ ప్రింటర్, బెంచ్‌లు, కుర్చీలను అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం బత్తుల రాజరాజేశ్వరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా పాఠశాల విద్యాశాధికారి వాసుదేవరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఫర్నీచర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్నీచర్‌ను అందించిన జోస్ అలుక్కాస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కార్తీక్, సామాజిక కార్యకర్త టి.సత్యనారాయణ, పాఠశాల సమన్వయ కర్త దంగుడుబియ్యం రాముడిని అభినందించారు. జోస్ అలుక్కాస్ డీజీఎం కార్తీక్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్యఅతిథులు, దాతలను సత్కరించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గెద్దాడ కృష్ణ, వైస్ చైర్మన్ వై.దుర్గారావు, సభ్యులు, ఉపాధ్యాయులు డి.సర్వేశ్వరరావు, జీఎస్‌కే అప్పారావు, జోస్ అలుక్కాస్ ప్రతినిధులు నితిన్, ప్రదీప్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల పరిరక్షణపై అవగాహన



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో 'గిరిజన హక్కుల పరిరక్షణ- అమలు'పై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇందులో శ్రీలక్ష్మి మాట్లాడుతూ గిరిజనులకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, నల్సా వారి (గిరిజన హక్కుల రక్షణ మరియు అమలు) పథకం 2015 గురించి వివరించారు. గిరిజనులు హక్కులను వినియోగించుకుని అభివృద్ధి సాధించాలన్నారు. వారికి అందుబాటులో ఉన్న పథకాలను తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి సహకారం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. సదస్సులో డిస్ట్రిక్ట్ ట్రైబల్ ఆఫీసర్ కేఎన్ జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ సిబ్బంది, న్యాయవాది డి.వెంకటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ పరిశీలన

స్థానిక ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని, కేవీ స్టేట్ హోం, బాల సదన్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.శ్రీలక్ష్మి సందర్శించి వసతులు పరిశీలించారు. న్యాయవాదిని నియమించుకోలేని వారికి ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారికి అందిస్తున్న సేవల గురించి వివరించారు. వసతి గృహంలో ఎటువంటి సమస్యలున్నా, న్యాయ సహాయం కావాలన్నా తెలపాలన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



ఎక్సైజ్ దాడుల్లో స్వాధీనం చేసుకున్న సామగ్రితో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి లావణ్య

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి సీహెచ్ లావణ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ ఎం.వినీషా ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సౌత్ స్టేషన్ పరిధిలో మంగళవారం విస్తృత దాడులు నిర్వహించారు. రాజానగరం మండలం రఘునాథపురం, శ్రీకృష్ణపట్నం గ్రామాల్లో, రాజమహేంద్రవరం రూరల్ మండలం కవలగొయ్యి, పిడింగొయ్యి గ్రామాల్లో విస్తృత దాడులు చేశారు. ఇందులో 8,300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి 95 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి శ్రీకృష్ణపట్నానికి చెందిన మార్గాని నాగేశ్వరరావు, రఘునాథపురానికి చెందిన వెటిగంటి గంగరాజు, కవలగొయ్యి గ్రామానికి చెందిన రేలంగి వెంకటేష్‌లపై కేసు నమోదు చేశామని లావణ్య తెలిపారు. ఎక్సైజ్ నేరాలపై ఏదైనా సమాచారం కలిగి ఉంటే రాజమహేంద్రవరం సౌత్ ఇన్‌స్పెక్టర్ 94409 02411 ఫోన్ నంబర్‌కు తెలపాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్లు జి.సత్యనారాయణ, ఆర్.త్రినాథ్, పి.సుబ్బిరెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్లు జి.రాజశేఖర్, రామానుజయ, సూర్యకుమారి, బి.అప్పారావు, సీహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా దిగుబడులు



మురమండలో వరి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు నరసింహారావు, శ్రీనివాస్, ఏడీ ద్వారకాదేవి

కడియం: ప్రస్తుత సీజన్‌లో వరి దిగుబడులు ఆశాజనకంగానే వస్తాయని ఆశిస్తున్నట్లు ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మురమండలో వ్యవసాయ క్షేత్రాలను ఏడీ కె.ద్వారకాదేవితో కలసి మంగళవారం పరిశీలించారు. దాళ్వా పంట ఆరోగ్యకరంగానే ఉందన్నారు. చిరుపొట్ట దశలో ఉన్నాయని, ఆఖరి మోతాదుగా ఎకరాకు యూరియా 50 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 20 కిలోలు వేసుకోవాలని రైతులకు సూచించారు. చీడపీడలు కూడా తక్కువగానే ఉన్నాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రం మచ్చ తెగులు ఆశించి పైరు పసుపు రంగులోకి మారిందన్నారు. నివారణకు జినేట్ (జెడ్-78) రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మరిడి సత్యనారాయణ పొలంలో వరి పంటను పరిశీలించారు. మరిడి వీరభద్రరావు, పాతూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల నుంచే కూరగాయలు కొనండి



వీఎల్ పురం రైతుబజార్‌లో రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ విజిలెన్స్ బృందం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం వీఎల్ పురం, వై.జంక్షన్‌లోని రైతుబజార్లను మంగళవారం మార్కెటింగ్ విజిలెన్స్ బృందం పరిశీలించింది. కొవ్వూరు మార్కెట్ కమిటీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా మార్కెటింగ్ అండ్ ట్రేడింగ్ అధికారి సునీల్ వినయ్, నిడదవోలు, రాజానగరం మార్కెట్ కమిటీ సెక్రటరీలు సత్యనారాయణ, రామ్మోహనరావులు రైతుబజార్లలోని రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు పండిస్తున్న పంట వివరాలను తెలుసుకుని, ఇకపై రైతుబజార్‌కు తీసుకువచ్చే ప్రతి పంట రైతుల నుంచి తీసుకు రావాలన్నారు. హోల్‌సేల్(దళారీలు) నుంచి కొనుగోలు చేయరాదని విజిలెన్స్ బృందం ఆదేశాలు జారీ చేసింది.

క్వారీ గోతులను వెంటనే పూడ్చాలని ధర్నా



మైన్స్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కొండబాబు తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక సుబ్బారావు నగర్, సింహాచలనగర్, సున్నంబట్టీ లేఅవుట్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న క్వారీ గోతులను వెంటనే పూడ్చాలని బత్తిన సుబ్బారావు సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం మైన్స్ ఏడీ కార్యాలయం వద్ద క్వారీ ప్రాంత ప్రజలు ధర్నా నిర్వహించారు. బత్తిన సుబ్బారావు సేవా సమితి గౌరవాధ్యక్షుడు, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు సారథ్యంలో ప్రజలు ఆందోళన చేపట్టారు. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు, యువకులు, పెద్దలు క్వారీ గోతులు వెంటనే పూడ్చాలని, మైన్స్ ఏడీ దిగి రావాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బర్రే కొండబాబు మాట్లాడుతూ క్వారీ గోతులు పూడ్చాలని ఎన్నో ఏళ్ల కిందట హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా మైన్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వారి నిర్లక్ష్యం వల్ల ప్రమాదకర క్వారీ గోతుల్లో పడి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి నీటిలో దోమలు పెరిగి స్థానికులు అనేక వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. సుమారు 100 ఎకరాల క్వారీ గోతుల భూమి, ఆ గోతుల్లో 120 అడుగుల లోతున నిల్వ నీరు ఉందన్నారు. హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘిస్తున్న మైన్స్ ఏడీపై కోర్టు ధిక్కరణ కేసు పెడతామని కొండబాబు హెచ్చరించారు. తక్షణ చర్యలు చేపట్టకపోతే త్వరలో జాతీయ రహదారి దిగ్బంధనం చేస్తామని ఆయన తెలిపారు. మైన్స్ ఏడీ అందుబాటులో లేకపోవడంతో ఆఫీస్ సూపరింటెండెంట్‌కు బర్రే కొండబాబు వినతిపత్రం అందజేశారు.

టీబీ ముక్త్ పంచాయతీ క్లెయిముల పరిశీలన



టీబీ ముక్త్ పంచాయతీ క్లెయిముల పరిశీలిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి వసుంధర

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు, వెంకటనగరం గ్రామ పంచాయతీ టీబీ ముక్త్ క్లెయిమ్స్‌ను జిల్లా పరిశీలన బృందం పరిశీలించిందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా అదనపు వైద్యాధికారి ఎన్.వసుంధర అన్నారు. మంగళవారం టీబీ ముక్త్ పంచాయతీ క్లెయిమ్స్ వెరిఫికేషన్ ప్రోసెస్‌ను ప్రారంభించారు. జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు నేతృత్వంలో జిల్లా అదనపు వైద్యాధికారి ఎన్.వసుంధర, జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతిమణి, ప్రభుత్వ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం నుంచి డా.సురేంద్ర, ఐఎమ్ఏ నుంచి డాక్టర్ వై.గురుప్రసాద్ సభ్యులుగా ఉంటారన్నారు. ఈ పరిశీలనకు బృందం రాజవోలు, వెంకటనగరం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్, సిబ్బంది, టీబీ సూపర్‌వైజర్, టీబీ ల్యాబ్ సూపర్ వైజర్ పాల్గొన్నారు. 2024వ సంవత్సరానికి జిల్లా నుంచి 107 పంచాయతీలు టీబీ ముక్త్ పంచాయతీలకు క్లెయిమ్స్ సమర్పించాయని డాక్టర్ వసుంధర తెలిపారు. ఇందులో 77 సిల్వర్ మెడల్, 29 బ్రాంజ్ మెడల్ కోసం పోటీ పడుతున్నాయన్నారు. 107 పంచాయతీల క్లెయిమ్స్‌ను జిల్లా బృందం, అలాగే 12 ఇతర బృందాలు క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తులను సెంట్రల్ టీబీ డివిజన్‌కు పంపిస్తాయని ఆమె తెలిపారు.

దివ్యాంగుల యోగక్షేమాలపై సర్వే



బాలవరంలో ఇంటింటా సర్వే చేస్తున్న బృంద సభ్యులు

రంగంపేట: దివ్యాంగుల యోగక్షేమాలపై ఇంటింటా సర్వే చేపట్టినట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది మడికి రాంబాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు నల్సావారి ఆదేశాల మేరకు పెద్దాపురం కోర్టు 7వ జిల్లా జడ్జి మరియు మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి.చంద్రమౌళేశ్వరి ఆదేశాలతో ఈ సర్వే చేస్తున్నామన్నారు. న్యాయశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, అంగన్‌వాడీ, ఆశ, ఏఎన్ఎం, వైద్యాధికారులు తదితర 14 మంది సభ్యులతో టీమ్ ఏర్పాటు చేశామని అన్నారు. ఇందులో భాగంగా టీమ్ సభ్యులు జి.దొంతమూరు, బాలవరం గ్రామాల్లో ఇంటింటా సర్వే చేశారన్నారు. దివ్యాంగుల యోగక్షేమాలు, వారికి అందుతున్న వైద్యం, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని సదరమ్ సర్టిఫికెట్లు వచ్చాయా లేదా, బాల్య వివాహాలు జరగకుండా ఉండేలా, వాటివల్ల కలిగే అనర్థాలు, శిక్షల గురించి తెలియజేశామన్నారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించామన్నారు. ఈ సర్వే నివేదిక కోర్టుకు సమర్పిస్తామని అన్నారు. న్యాయవాది మడికి రాంబాబు, డాక్టర్ విజయవర్ధిని, పీఎల్‌వీలు నూతలపాటి అప్పలకొండ, డి.విజయ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ



రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రాజెక్టులో ప్రతిభ చాటిన విద్యార్థులతో హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనలో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అన్నారు. మంగళవారం స్థానిక హైస్కూల్లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న రామచంద్రపురం రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో ఆన్‌లైన్ ద్వారా 100 ప్రాజెక్టులు రాగా ఐదు ఉత్తమ ప్రాజెక్టులు ఎంపికయ్యాయని అన్నారు. వాటిలో రంగంపేట హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎ.రమ్య, జె.సీతామహాలక్ష్మి రూపొందించిన సెక్యూరిటీ అలెర్ట్ డోర్ బెల్ ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైందన్నారు. ఈ ప్రాజెక్టుకు పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధ గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. అలాగే టీచర్ ఎగ్జిబిట్ కేటగిరీలో రమ్యసుధ రూపొందించిన స్టూడెంట్ ఫ్రెండ్లీ పెన్ విత్ కాన్సన్‌ట్రేషన్ డిటెక్టర్ ప్రాజెక్టు ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపిక అయ్యిందన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే సైన్స్ పోటీల్లో రమ్యసుధ తన ప్రత్యేకతను కనబరుస్తూ బహుమతులు సాధిస్తున్నారని అభినందించారు. మండల విద్యాశాఖాధికారులు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, సీఆర్ఎంటీ ఎల్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పట్టదా...



శాటిలైట్‌సిటీలో ఎగురుతున్న జనసేన పార్టీ జెండా



శాటిలైట్‌సిటీలో బీజేపీ జెండా

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో అధికారుల ఉదాశీనత రాజ్యమేలుతోంది. శాటిలైట్‌సిటీ గ్రామంలోని మోడల్ బిల్డింగ్ వద్ద జనసేన, బీజేపీల జెండాలు రెపరెపలాడుతున్నా అధికారులకు మాత్రం అవి కనిపించడం లేదు. ఇది చూసిన ప్రజలు విగ్రహాలకే తప్ప పార్టీ జెండాలకు ఎన్నికల కోడ్ వర్తించదా అని ప్రశ్నిస్తున్నారు.

లయన్స్ క్లబ్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు



యూత్ సర్వీస్ అవార్డు అందుకుంటున్న జి.మామిడాడ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రాజారెడ్డి

పెదపూడి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లయన్స్ మల్టిపుల్ 316బీలో యూత్ సర్వీసెస్ ప్రోగ్రామ్‌లో 2024-25 సంవత్సరానికిగాను ఉత్తమ సేవలు అందించినందుకు జి.మామిడాడ లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీసూర్యకు రాష్ట్ర స్థాయి ఉత్తమ క్లబ్ అవార్డు లభించిందని ఆ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ మండ రాజారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ విజయవాడలో లయన్స్ సర్వీస్ సెంటర్ వద్ద మంగళవారం జరిగిన సేవా యజ్ఞం కార్యక్రమంలో మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ శాంతి, లయన్స్ ఇంటర్నేషనల్ 3వ ఉపాధ్యక్షులు ఎండార్సీ, విజయకుమార్‌రాజు, పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ చిగురుపాటి శంకర్, 316బీ గవర్నర్ ఈశ్వర్ కుమార్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నానన్నారు.